

తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు ప్రారంభం

హైదర్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ నందమూరి నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్నర్ స్టోన్ కంపెనీ సౌజన్యంతో సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.20 లక్షలతో రెండు అదనపు తరగతి గదులు నిర్మించారు. వీటిని శుక్రవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. కార్నర్ స్టోన్ కంపెనీ పేద విద్యార్థుల కోసం గదులు నిర్మించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గుడిసెవాసులతో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

బసవతారకనగర్‌లో పర్యటించిన తీన్మార్ మల్లన్న

రాయదుర్గం, జూలై 4(ఆంధ్రజ్యోతి): గౌలిదొడ్డి బసవతారకనగర్ గుడిసెవాసులకు అండగా ఉంటామని తీన్మార్ మల్లన్న అన్నారు. శుక్రవారం ఆయన బసవతారకనగర్‌లో పర్యటించి గుడిసెవాసులతో మాట్లాడారు. సర్వే నంబర్ 36,37లోని ప్రభుత్వ భూమిలో 30 సంవత్సరాలుగా పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని మల్లన్న అన్నారు. ఇటీవల స్థానిక ప్రజాప్రతినిధుల ఆదేశాలతో ఈ గుడిసెలు తొలగించిన ఘటనపై స్థానికంగా ఉద్రిక్తత నెలకొందని, దీనిపై స్థానికుల కోరిక మేరకు తాను ఇక్కడకు వచ్చానన్నారు. గుడిసెవాసులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. స్థానికంగా కబ్జాకు గురైన ఇళ్ల స్థలాలను ఆయన పరిశీలించారు. అనంతరం బాధితులతో కలిసి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి వారి సమస్యను అధికారులకు వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హైదనగర్ ఏఈ తెలిపారు. 11కెవి లక్ష్మీనగర్ ఫీడర్ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు చందానగర్ రత్నదీప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, లక్ష్మీనగర్, బుద్ధ అపార్టమెంట్స్, నమహా అపార్ట్‌మెంట్స్ ప్రాంగణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. 11కెవి శ్రీలాగార్డెన్స్ ప్రాంగణంలో ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

నేడు చందానగర్ పీజేఆర్ స్టేడియంలో రక్తదాన శిబిరం

ఖైల్‌కాలనీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల సహాయార్థం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం చందానగర్‌లో గల పీజేఆర్ స్టేడియంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రతి ఏటా తలసేమియా వ్యాధితో వేలాదిమంది చిన్నారులు మృతి చెందుతున్నారని, రక్తం సకాలంలో అందిస్తే ప్రాణదాతలు అవుతారన్నారు.



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, మాజీ ఎమ్మెల్సీ పద్మరాజు



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్



సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్ తదితరులు

మన్యం వీరుడికి ఘన నివాళి

హైదర్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్‌లలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. హైదర్‌నగర్ ఉషా ముళ్లపూడి కమాన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉషా ముళ్లపూడి కమాన్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు. కార్యక్రమంలో క్షత్రియ యూత్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మియాపూర్ డివిజన్‌లో..

మియాపూర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని సీతారామరాజు నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాయుధ పోరాటంతోనే స్వతంత్రం వస్తుందని నమ్మి, పోరాటంలో ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడు అల్లూరి అన్నారు. 22 ఏళ్ల వయసులోనే మన్యం ప్రజలను కలుపుకుని బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన సీతారామరాజు ఆదర్శప్రాయుడని కొనియాడారు.



సొసైటీ మేనేజింగ్ సభ్యులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి

ఖైల్‌కాలనీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే ఉత్తమ ఫలితాలు సాధించి రాణిస్తారని భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాలు, అసోసియేషన్‌లకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతిరోజూ కాసేపు వ్యాయామం చేయాలని, మెడిటేషన్ చేయాలన్నారు. క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలో గల అన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామని, క్రీడా ప్రాంగణాలు, మైదానాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. డివిజన్ అభివృద్ధి కోసం చేపడుతున్న పనులకు ప్రజలు సహకారం అందించాలని కోరారు.

స్పా, మసాజ్ కేంద్రాల నిర్వాహకులు మార్గదర్శకాలు పాటించాలి

హైదరాబాద్ సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్పా, మసాజ్ కేంద్రాల ముసుగులో జరుగుతున్న అనైతిక కార్యకలాపాలను అరికట్టేందుకు సైబరాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, చిన్న పిల్లల రక్షణకు సంబంధించి పలు ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తున్నారు. తాజాగా యాంటీ హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్, లా అండ్ ఆర్డర్ వింగ్, స్పెషల్ ఆపరేషన్స్ టీం(ఎస్‌ఓటీ)ల ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాపూర్ డీసీపీ డా.వినీత్ అధ్యక్షతన మానవ అక్రమ రవాణాపై ఎలా ముందుకు వెళ్లాలన్నదానిపై చర్చించారు. ఇందులో భాగంగా నగరంలో ఉన్న స్పా సెంటర్లు, మసాజ్ కేంద్రాలకు సంబంధించి పలు మార్గదర్శకాలను రూపొందించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మహిళా శిశు భద్రత విభాగం డీసీపీ సృజన కర్ణం, మాదాపూర్ ఎస్‌ఓటీ డీసీపీ శోభన్ కుమార్, మాదాపూర్ ఎస్‌ఓటీ ఏడీసీపీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివేకానందనగర్ నుంచి సభకు తరలివెళ్తున్న నాయకులు

మహాసభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

హైదర్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎల్బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ మహాసభకు శేరిలింగంపల్లి ఇన్‌చార్జి, పీసీసీ కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో వివేకానందనగర్ డివిజన్ నుంచి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగమణియాదగిరి, యాదగిరి, మోజేష్, పరుశురాములు, నాగుల మల్లేష్, బొల్లం యాకయ్య, వెంకటేష్, ప్రశాంత్, శాంతమ్మతో పాటు పలువురు ఉన్నారు.

ముగిసిన వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

ఖైల్‌కాలనీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ ఎల్ఐజీకాలనీలో తొమ్మిదిరోజులుగా నిర్వహిస్తున్న వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం జరిగిన పూర్ణాహుతితో ముగిశాయి. యాగకర్త వంశీకృష్ణ ఆధ్వర్యంలో తొమ్మిదిరోజుల పాటు అమ్మవారికి నిత్యపూజలతో పాటు విశేష హోమాలు, అభిషేకాలను నిర్వహించారు. ప్రతి రోజూ అమ్మవారిని ఒక్కో రూపంతో అలంకరించి, అభిషేకాలు, అర్చనలు చేశారు. మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం నిత్య హోమం, విశేష పూర్ణాహుతి జరగగా బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దొడ్డి కొమురయ్యకు నివాళులు

హైదర్‌గర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని కూకట్‌పల్లిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉమారాణి, చంద్రమ్మ, సరోజ, నాగమణి, కళావతి, శ్రీనివాస్‌చారి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన ప్రజలు

గచ్చిబౌలి, జూలై 4(ఆంధ్రజ్యోతి): సుమారు రూ.2కోట్ల విలువైన హుడా స్థలం కబ్జాను స్థానికులు అడ్డుకున్నారు. లింగంపల్లిలోని హుడా ట్రేడ్ సెంటర్‌లోని కూరగాయల మార్కెట్ పక్కన ఓ వ్యక్తి తన సొంత ప్లాటు 260 గజాలు విక్రయించాడు. ఆ ప్లాటు పక్కనే ఉన్న సుమారు 200 గజాల హుడాకు చెందిన ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో సదరు యజమాని ఈ స్థలం కూడా తాను కొనుగోలు చేశానిని స్థానికులపై బెదిరింపులకు పాల్పడ్డాడు. అయితే స్థానికులు హెచ్ఎండీఏ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో సైట్ ఇన్‌చార్జి శ్రీశైలం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హుడా స్థలానికి కంచె నిర్మాణ పనులను అడ్డుకున్నారు. పాతిన కడ్డీలను తొలగించారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



హుడా స్థలాన్ని కబ్జా చేసేందుకు కంచె వేస్తున్న దృశ్యం

హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

రాయదుర్గం, జూలై 4(ఆంధ్రజ్యోతి): భూమిని తాకట్టుపెట్టి తెచ్చిన డబ్బును బెట్టింగ్‌లో పోగొట్టాడని కొడుకును మందలించిన తండ్రిని దారుణంగా హత్య చేసిన సంఘటన విషయం తెలిసిందే. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం రేపిన ఈ కేసులో పోలీసులు అన్ని కోణాల్లో ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌లోని సోపాకాలనీలో నివాసం ఉంటున్న హన్మంతు(37)ను కొడుకు రవీందర్ కత్తితో పొడిచి చంపగా.. రవీందర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు హన్మంతును ఒక్కడే హత్య చేశాడా? లేదా అతనికి ఎవరెవరు సహకరించారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువజన నాయకులు

స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలి

పేట్‌బషీరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద అడుగుజాడల్లో యువత నడుచుకోవాలని వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్ అన్నారు. వివేకానంద వర్ధంతి సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్ లోని గాంధీనగర్ కమ్యూనిటీ హాల్లో యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి ఆయన పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనాథ్ మాట్లాడుతూ, భారత దేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన ఘనత స్వామి వివేకానందదేనని అన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు రంగాసాయిగౌడ్, తిమ్మయ్య, నవీన్, విజయ్, సత్యనారాయణ, దత్తాగౌడ్, సందీప్, సాయికిరణ్ పాల్గొన్నారు.



గాజులరామారంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

రోడ్డుపై నీరు.. అధికారులు పట్టించుకోరు!

● రాకపోకలకు వాహనదారుల అవస్థలు

గాజుల రామారం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వర్షం వస్తే చాలు రోడ్లపై మోకాలు లోతు నీరు నిలిచి వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. గాజుల రామారంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రోడ్డు వర్షపు నీటితో నిండి ఉంది. ఈ రోడ్డు నిర్మించేటప్పుడు అధికారులు ప్రాణాళికాబద్ధంగా నిర్మించకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతోందని గాజులరామారం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పైబస్తీలు, కాలనీలు నుంచి వచ్చే వరద నీరు ఇక్కడకు చేరి, సమీపంలో ఉన్న నాలాలోకి వెళ్తోంది. అయితే, రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉండటం వల్ల ఈ నీరంతా రోడ్డుపైనే నిలిచిపోయి స్థానికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని గాజులరామారం గ్రామస్తులు వాపోతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

ప్రమాదకరంగా పైప్‌లైన్ రోడ్డు



పేట్‌బషీరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల గ్రామం నుంచి పైప్‌లైన్ వైపు వెళ్లే రోడ్డుపై ఇసుక, కంకర, మట్టి దిబ్బలు పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు, సైక్లిస్టులు పట్టు తప్పి పడిపోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక, కంకర, మట్టి దిబ్బలను తొలగించి, గుంతలను పూడ్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డు పెట్టినా లెక్కలేదు!

● రోడ్డుపక్కనే చెత్త వేస్తున్న స్థానికులు
● దుర్వాసనతో ప్రయాణికుల అవస్థలు

దుండిగల్, జూలై4 (ఆంధ్రజ్యోతి): బహదూర్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ నివాసాల సమీపంలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకు పోయింది. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం సామాజిక నేరమని, రూ. వెయ్యి జరిమానా విధిస్తామని దుండిగల్ మున్సిపాలిటీ అధికారులు హెచ్చరిక బోర్డుపెట్టినా ఉపయోగం లేకుండా పోయింది. ఆ బోర్డు వద్దే చెత్తను తెచ్చిపోస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రహరీ లోపల వేయడంతో పాటు ప్రధాన రహదారి పక్కన చెత్త భారీగా పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. దీంతో ఆ రోడ్డుపై రాకపోలు సాగించే వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్ పారిశుద్య సిబ్బంది, అధికారులు ఈ చెత్తను తొలగించి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని స్థాని కులు కోరుతున్నారు.



చెత్త వేయడం సామాజిక నేరం అని బోర్డుపెట్టిన చోటే వేసిన చెత్త



డబుల్ బెడ్‌రూమ్‌ల పక్కనే పేరుకుపోయిన చెత్త

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పేట్‌బషీరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని కుత్బుల్లాపూర్ పశువుల ఆస్పత్రి అధికారి అనిల్‌కుమార్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డ ఆలయంలోని గోవులకు ఆస్పత్రి జూనియర్ అధికారి పద్మ, ఏవీ కృష్ణ శుక్రవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ మండలంలోని జీడిమెట్ల గ్రామం, అంగడిపేట, సుభాష్‌నగర్, చింతల్ తదితర ప్రాంతాల్లో దాదాపు 2030 పశువులు ఉన్నాయని, వీటికి తొలకరి జల్లులు పడుతున్నప్పుడే గుండె జబ్బు, వాపు వ్యాధులు సోకకుండా మందులు వేస్తున్నామన్నారు. శనివారం నుంచి ఎల్‌ఎస్‌డీ టీకాలు వేస్తున్నామని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.



కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బస్సులో సభకు వెళ్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



సభకు వెళ్లే ముందు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

'సామాజిక న్యాయ సమరభేరి'కి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

నిజాంపేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ సభకు కాంగ్రెస్ పార్టీ కుత్బులా పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నుంచి వెళ్లారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు భారీ సంఖ్యలో బస్సుల్లో ఎల్బీ స్టేడియంకు తరలి వెళ్లారు.

నియోజకవర్గంలో కాంగ్రెస్ పటిష్ఠం: కూన

జీడిమెట్ల,జూలై4(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్ఠంగా ఉందని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఎల్బీ స్టేడయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభకు శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో 40 బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలపై దాదాపు 3వేల మంది నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు సభకు వెళ్లారు.



కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దూలపల్లి గ్రామస్థులు

రోడ్డు విస్తరణ బాధితులను ఆదుకోండి

● కమిషనర్‌కు దూలపల్లి గ్రామస్థుల వినతి

పేట్‌బషీరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణలో ఇల్లు, షాపులు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి ఆదుకోవాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్ కృష్ణారెడ్డిని దూలపల్లి గ్రామస్థులు కోరారు. శుక్రవారం 30 మంది గ్రామస్థులు కమిషనర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వ్యాపారులు మాట్లాడుతూ, రోడ్డు పక్కన పంట పొలాల్లో చిన్నచిన్న షెడ్లు వేసుకొని సుమారు 40 ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్నామన్నారు. అప్పట్లో 16 ఫీట్ల రోడ్డు ఉండేదని దూలపల్లి సర్వే మ్యాప్‌లో ఉందన్నారు. సర్వే నంబర్లు 145, 149, 68 రోడ్డుకు రెండు వైపులా పట్టా భూములు ఉన్నాయని, గ్రామ పంచాయతీ అనుమతితో ఇళ్లు కట్టుకొని, షాపులు ఏర్పాటు చేసుకొని ట్యాక్స్, విద్యుత్, వాటర్ బిల్లులు కడుతున్నామన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు, షాపులు కోల్పోతున్న తమకు ఇప్పటి వరకు ఎలాంటి పారితోషకం అందలేదన్నారు. కమిషనర్‌ను కలిసి వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ బూరుగుబావి సత్యనారాయణ, అశోక్, రాజు, కిషోర్, సురేందర్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.



కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

షాపూర్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): భూమికోసం, భుక్తి కోసం పోరాడి అమరుడైన తెలంగాణ సాయుధపోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. కొమురయ్య వర్ధంతి సందర్భంగా షాపూర్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పసుల అంజయ్య, రావుల స్వాతి, ఈ.దేవదానం, లింగం, కె.శ్రీను, నర్సింహులు, దుర్గానాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, జూలై 4(ఆంధ్రజ్యోతి): గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని మగ్దూంనగర్, జగద్గిరిగుట్ట, శ్రీరామ్‌నగర్, ఉషా ముళ్ల పూడి 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చైతన్య భార్గవ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మగ్దూంనగర్, ఎన్టీఆర్‌నగర్, నాగార్జున స్కూల్ లేన్ శ్రీరామ్‌నగర్ బేకరీగడ్డ, శ్రీరామ్‌నగర్-ఏబీల్లో విద్యుత్‌ను నిలిపి వేస్తామని ఏఈ పేర్కొన్నారు.

పేట్‌బషీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో...

విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా పేట్‌బషీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఈ కింది ప్రాంతాలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు దండమూడి ఎన్‌క్లేవ్ సురక్ష ఆస్పత్రి, వీఎస్ఎస్ నందదీప్, పిస్తా హౌస్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఏఈ వెల్లడించారు.